11.

# ఏట్టివారు శ్రీరామతత్వమును గుర్తించగలరు

చక్కెర కంటె తీపి దధిసారము కంటెను రుచ్యమౌను పెం
పెక్కిన తేనె కన్న అతి తృప్తినిడున్ మరి పల్కపల్కగా
మిక్కిలి కమ్మనౌ అమృతమే అనిపించును కాన నిత్యమున్
చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు రామనామమున్

ప్రేమస్వరూపులారా!

విశ్వాసమునకు రాముడే విభుడు. అతనే హితుడు. ఇట్టి ఆదర్శమూర్తి అయినటువంటి రామచంద్రుని తత్త్వాన్ని గుర్తించుకోవడం అంత సులభం కాదు. సముద్రములోని అలలను లెక్కించుకోవడము కూడను సులభమే కాని, రామునియొక్క గుణగణములను వర్ణించడానికి సాధ్యము కాదు. అందరి యందున్నటువంటిది రామచంద్రుడే. సృష్టియే ఒక గృహము. యావత్ మానవజాతియే ఒక కులము. ఇట్టి సంబంధ బాంధవ్యములను గుర్తించినటువంటి వ్యక్తి మాత్రమే రామతత్త్వాన్ని గుర్తిస్తాడు. అందరి పాదముల క్రింద ఉన్నది ఒకే భూమి. అందరి తలలపై ఉన్నది ఒకే ఆకాశము. అందరూ పీల్చుకునేది ఒకే గాలి. అందరూ త్రాగునది ఒకే నీరు. ఇట్టి ఏకతత్త్వాన్ని గుర్తించినటువంటి వ్యక్తులు మాత్రమే రామతత్త్వాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. వేదములు రెండు విధములైనట్టి ధర్మములు బోధించినాయి. ఒకటి ప్రవృత్తి, రెండవది నివృత్తి అనియు.

## ప్రవృత్తి నివృత్తుల తత్త్వాన్ని గుర్తించినవాడే టీచర్

ప్రవృత్తి లౌకికము. ప్రాకృతమైన జీవితమునకు సరిపోవునట్టి గుణములను ఏర్పరచుచున్నది, కాని, నివృత్తి ఆత్మజ్ఞానమును బోధిస్తున్నది. ఈ ప్రవృత్తి, నివృత్తికి ఉండేటట్టి బేధములు గుర్తించినట్టివాడే టీచర్. ఏ పనియైనను, ఎలా చేయాలి

sri sathyasai vachanamrutam

అనేటటువంటిది ఒక ప్రవృత్తి. ఎట్టి స్థితిలో చేయాలి అనేది నివృత్తి. మానవునికి ఆకలివేసిన తక్షణమే భుజించి, ఆకలి తీర్చుకోమని చెప్తుంది ప్రవృత్తి. కాని, ఎట్టి ఆహారము భుజించాలి? ఏవిధముగా భుజించాలి? ఇది ఏవిధమైనట్టి ఆరోగ్యాన్ని చేకూరుస్తుంది అనే సరియైనటువంటి మార్గాన్ని బోధించేటంటిది నివృత్తి. కనుక ప్రవృత్తి, నివృత్తులయొక్క ధర్మములు యీ బాహ్యము, అంతరాత్మలకు సంబంధమైనటువంటిది. కంటికి కనిపించునది, చెవులకు వినిపించునది, మనసునకు అనిపించునది, హృదయాన్ని కరిగించునది, జీవితాన్ని పండించునది, యిదియే నివృత్తియొక్క మార్గము. మనసును చలింప చేసి, బుద్ధిని భ్రమింపచేసి, నివృత్తి మార్గమునందు ప్రవేశింపకుండా చేయుటయే యీయొక్క ప్రవృత్తియొక్క ధర్మము. ధర్మమార్గములకు అత్యంత దూరమునందు చేర్చునదే ప్రవృత్తి. ఇట్టి రామచంద్రతత్త్వాన్ని గుర్తించడానికి పవిత్రమైనట్టి హృదయధర్మాన్ని మనము గుర్తించాలి.

**మానవ హృదయమే అయోధ్య**

జీవితము ఒక విధమైనట్టి ఘర్షణ. జీవితము ఒక విధమైనటువంటి సంఘర్షణ. కాని ఎట్టి సంఘర్షణలు లేనటువంటి ఒక స్థానము. అదియే అయోధ్య ఎట్టి విరోధులు కూడా ప్రవేశించనట్టి ప్రదేశమే అయోధ్య. అట్టి అయోధ్యనే మానవునియొక్క హృదయము. ఎట్టి ద్వేషములు, ఎట్టి కళంకములు, ఏ విధమైనట్టి చెడు రూపములు ధరించనటువంటి ఒక యీ మనస్తత్వమే, అనేక ఘర్షణలతో వివరణ చేసుకొని, ఆ యొక్క సంయోగ, వియోగములకు గురియైనట్టిదే యీ యొక్క ప్రవృత్తి లక్షణము. కనుక, మానవుడు యీనాడు అశాంతికి గురియై, శాంతికి దూరమవుతున్నాడు. కారణము? ప్రవృత్తిమార్గము ననుసరించడము చేతనే. ఈ విధమైనటువంటి సంయోగ, వియోగములకు గురియై, సర్వకాలములందు కూడా, అశాంతిని పొందుతున్నాడు. ఇట్టి అశాంతిని పొంది, జీవితమును వ్యర్థము కావించుకున్నట్టివాడే రావణుడు. అతను నిరంతరము ప్రవృత్తి మార్గమును అనుసరిస్తూ వచ్చాడు. తన కోరికలను తాను చంపుకోలేక, తన కొడుకులను చంపుకున్నాడు. తన వాంఛలను చంపుకోలేక, తన వంశాన్నే తాను చంపుకున్నాడు. తన

sri sathyasai vacharamrutam

రాగములను తాను చంపుకొనలేక, రాజ్యమునే భస్మము చేసుకున్నాడు. కట్టకడపటకు రావణుడు బోధించినటువంటిది యిదియే. "లోక ప్రజలారా! నావలె రాగములను జయించకోలేక, నా వలె వాంఛల నరికట్టకోలేక, నావలె కోర్కెలనరికట్టుకోలేక, కడపటికి నేనుకూడ లేకుండాపోతున్నాను. నాకు నిల్చినది ఏమిటీ జగత్తులో? అపకీర్తి మాత్రమే నిల్చింది. సత్కీర్తి అనేటంటిది రామునికి చెందుతుంది. కనుకనే సత్కీర్తిని సాధించండి. అపకీర్తికి ఏమాత్రము అడుగివ్వకండి", అని రావణుడు బోధించాడు. జగత్తులో పాపాలను, ద్వేషాలను నశింపజేసి మానవత్వాన్ని అభివృద్ధి పరచేటంటిది రామతత్త్వము. ఇట్టి ఆదర్శవంతమైనట్టి రామత్త్వానికి తగినటువంటి అవకాశాన్ని మనము చేకూర్చుకోవాలి.

**రాముడు ఆదర్శ మానవత్వాన్ని నిరూపించాడు**

రాముడు కేవలము సామాన్య మానవునివలె తిరుగుతూ వచ్చాడు ఆదర్శమార్గమును అందిస్తూ వచ్చాడు. రామునివలె జీవించలేదే? సామాన్య మానవునివలె జీవించి సాలోక్య తత్త్వాన్ని పొందినట్టివాడు రాముడు. ఆదర్శవంతమైనట్టి ఒక ఆత్మ తత్త్వాన్ని నిరూపించినట్టివాడు రాముడు. కనుకనే ఈనాడు రామాయణము అత్యవసరము లోకానికి. కారణమేమనగా, తండ్రిమాట పిల్లలు వినటంలేదు. బిడ్డలకు సరియైనట్టి ఆదర్శములు చూపించటంలేదు తండ్రులు. గురువులు శిష్యులకు సరియైనట్టి మార్గాన్ని బోధించటంలేదు. శిష్యులు సరియైనట్టి గురువులకు, తగినట్టి గౌరవము అందించటంలేదు. ఈనాటి వ్యాపారస్తులు, అధికారులు, పాలకులు, పాలితులు అందరు కూడా కలుషితమై ఉంటున్నారు. కలహములో మునిగి వున్నారు. ఇట్టి కలుషితమైన కలహములకు మార్గమైనట్టిదే యీ యొక్క లోకసమ్మతము. రామతత్త్వాన్ని మరచారు. కామతత్త్వాన్ని మేల్కొలిపారు. జీవతత్త్వాన్ని నశింప చేశారు. దైవత్వాన్ని మరచిపోయారు. కనుకనే యిన్ని కష్టములకు గురియవుతున్నారు, మానవులు. దైవముకూడను, దైవము మానుష రూపేణ. కానీ మానవావతారము వచ్చినా కూడను, మన సందీప్ సహాని చెప్పాడు. భగవంతుని ఏవిధముగా ప్రార్థిస్తున్నారీనాటి మానవులు? తమ అభీష్టములు నెరవేరాలి. తమ శరీరములకు సుఖములు అందించాలి. తమ మనసుకు శాంతి చేకూర్చాలి. ఈ విధముగా

sri sathyasai vachanamrutam

కోరడమే సహజము. కానీ, యీ సహజమునకు కూడను అసహజము యిమిడి యుంటున్నాది. రాతి నాగమునకు పోయి ప్రార్థిస్తున్నారు. 'ఓ నాగేంద్రా! నాకు ప్రత్యక్షమయి నా కష్టములు తీర్చమని ప్రార్థిస్తారు. కానీ, ఆ నాగుడే ప్రత్యక్ష సజీవుడైనట్టి నాగుడుగా వచ్చినప్పుడు, ఆ ప్రతిష్ట చేసినటువంటి, రాయితోనే ఆ నాగాన్ని చంపుతారు. 'కల్ల నాగర కండర కండచక్కెరట్లు' కల్ల నాగర అనగా రాతి నాగును చూస్తే కండ చక్కెర నైవేద్యంగా పెడ్తారు. నిజమైన నాగమే వచ్చినప్పుడు, దానికి తిండి పెట్టేవాడే కాదు, ప్రాణాలు కూడ తీస్తారు.

**రామ నామ విశిష్టత**

దైవమనగా ఏ రీతిగా ఉండాలి? ఎవరు నిర్ణయించగలరు? ఎవరుకూడను నిర్ణయించలేరు. దైవము ఏరీతిగా ఉండాలి, అని దైవమే నిర్ణయించాలి కాని, యింకొకరు నిర్ణయించడానికి అధికారము లేదు. అదియే త్యాగరాజు కూడ చెప్పాడు. "ఎవరు నిన్ను నిర్ణయించేదిరా?" నిన్ను ఎవరని నిర్ణయించేదిరా? జీవమంత్రమునకు 'రా'జీవము. శివ మంత్రమునకు 'మ' జీవము. మాధవ మంత్రమునకు 'రా' జీవము. ఈ వివరము తెలిసినటువంటి ఘనునకు మ్రొక్కెద అన్నాడు. పంచాక్షరి అయినట్టి నమశ్శివాయ అనే నామము లోపల 'మ'కారము ప్రాణము. వైష్ణవ నామమైనట్టి ఓం నమో నారాయణాయ అనేటువంటి అష్టాక్షరిలో 'ర' కారము ప్రాణము. నారాయణాయ లోపల, 'ర' కారము పోయినట్లయితే, 'నాయణాయ' అని చచ్చిన వానితో సమానము. ఆ 'రా' వచ్చినప్పుడే, అది ప్రాణములో ఉన్నటువంటి సహజము. నారాయణాయ కనుకనే యిందులో వైష్ణవ నామములో 'రా' ప్రాణము. నమశ్శివాయ అనే పంచాక్షరి లోపల 'మ' కారమే ప్రాణము. 'మ' కారము లేకపోతే 'నశివాయ'. శివుడు లేనటువంటిది అని. కనుక అక్కడ 'మ'కారము ఉండే తీరాలి. ఈ రెండింటియొక్క చేరికనే 'రామ' అనేటువంటి యీ నామము. కనుకనే యిది ప్రాణ స్వరూపమైనట్టి నామము. 'ర-అ-మ'. యీ మూడింటియొక్క అక్షరముల చేరికనే ర-అగ్ని బీజము, అ-సూర్య బీజము, మ-చంద్ర బీజము. ఈ మూడింటియొక్క ఏకత్వమే రామనామము. అగ్ని బీజము ఉన్నటువంటి పాపములన్నీ కూడను భస్మము

sri sathyasai vachanamrutam

కావిస్తుంది. సూర్య బీజము అనేటువంటిది మన అజ్ఞానమనే అంధకారమును దూరము చేస్తుంది. చంద్ర బీజము మన తాపములు చల్లార్చి, హాయిని చేకూర్చుతుంది. పాపములు, దుర్మార్గములు, తాపములు చల్లార్చేటట్టి శక్తి కలిగినట్టిదే రామనామము.

**తలపు, మాట, చేతల ఏకత్వమే రామతత్త్వము**

ఇట్టి పవిత్రమైనటువంటి రామతత్వాన్ని ఏవిధముగా, రూపముగా బోధించేటువంటిది మానవాకారము చేతనే యీ జగత్తునందు అవతరించి మానవునకు సరియైనట్టి ఆదర్శమును నిరూపించాడు రాముడు. తన తలంపు, తనమాట, తన చేతలు మూడింటియొక్క ఏకత్వమే రామనామము. The proper study of mankind is man. ఈ మానవాకారము ఏవిధముగా వచ్చింది? తన అలోచనలు, తన వాక్కు, తన క్రియలు మూడింటిని ఏకత్వము చేకూర్చాడు. కనుక రామతత్త్వమనగా అనేక విధములైనట్టి శక్తి సామర్థ్యములతో కూడినటువంటిది రామాయణము అంటే కేవలము పారాయణము జరిపేటటువంటిది కాదు. రామ-అయనము, రామాయణము అనగా రామతత్త్వమనేటటువంటిది 'సర్వత్రా ప్రయాణము చేసేటటువంటిదే. సర్వత్రా ఉండినట్టిదే రామతత్త్వము. సర్వవ్యాపకమైనట్టిదే రామతత్త్వము. ఈ అంతరాత్మనే రామతత్త్వము. అందుకో ప్రాచీనములో నా ఆత్మారామునికే చెల్లుతుంది అంటారు. ఆత్మకే రామ అని పేరు. రమింప చేసేటటువంటిదే కనుక రామ అని పేరు. ఇటువంటి రమింప చేసేటటువంటి దివ్యతత్వానికి ఎట్టి రూపాన్ని నిర్ణయించగలము? కనుక రామాయణము అనేటువంటి చరిత్రయందు, ఒక విశిష్టమైనట్టి దివ్యత్వము చేకూరి ఉంటుంది. ఆ విశిష్టత ఏమిటి? అనగా, మానవుడు మానవునిగా జీవించాలి. మానవుడు దైవత్వముతో ఏకంగా కావాలి. మానవునియందు ఉన్నటువంటి త్రిగుణములతత్వాన్ని ఏకత్వము చేయాలి. ప్రతి మానవునియందు కూడను, మానవత్వము, దానవత్వము, దైవత్వము మూడు కూడను ఏకమై ఉంటుండాలి. కాని, యీనాటి మానవుడు, దైవత్వాన్ని మానవత్వాన్ని కూడ మరచి, కేవలము దానవత్వాన్ని మాత్రమే వహిస్తున్నాడు. కనుక మానవుడు దైవత్వాన్ని నిరూపించాలి కాని, హీనత్వాన్ని లేక రాక్షసత్వాన్ని మనం నిరూపించకూడదు.

### శ్రీరాముడు కష్టసుఖాల్లో సమత్వము నిరూపించాడు

కనుకనే రాముడు ఆదర్శప్రాయుడై పితృవాక్య పరిపాలన నిమిత్తమై అరణ్యమునకు వెళ్ళి, అనేక విధములైనట్టి కష్టములకు గురి అయ్యాడు. అయితే, ఇది ఒక బలవంతంతో పోయాడా? లేక అసంతృప్తితో పోయాడా? లేదా ఒక విధమైనటువంటి తండ్రి ఆజ్ఞ అని ఒక దీక్షతో వెళ్ళాడా? కాదు కాదు. పట్టాభిషేకమునకు ఎట్టి ఆనందముతో వచ్చి, ఎట్టి విధమైనట్టి సంతోషముతో ముందంజ వేసాడో, అదే అడుగుతోనే, అదే సంతోషముతోనే అరణ్యానికి కూడను తాను వెళ్ళాడు. సమత్వాన్ని నిరూపించినట్టివాడు రాముడు. 'సుఖదుఃఖే సమేకృత్వా, లాభా లాభౌ జయాజయౌ' మానవుని జీవితములోపల సుఖదుఃఖములు, ఒక విధమైనటువంటి సహజంగా ఉంటాయి. కాని సుఖాన్ని ఆశించటము, దుఃఖాన్ని త్యజించటము, యిది మనలో ఉన్నటువంటి సద్గుణము కాదు. సుఖములు ఏ హృదయముతో నీవు స్వాగతమిస్తున్నావో, దుఃఖమును కూడ ఆ విధమైనట్టి భావముతో నీవు స్వాగతము చేయాలి. దుఃఖమే లేకపోతే, సుఖమునకు విలువే లేదు. దీనినే అన్నారు. 'నసుఖాత్ లభ్యతే సుఖం' అన్నారు. సుఖమునుండి సుఖము మనకు చిక్కదు. దుఃఖమునుంచియే మనకు సుఖం చిక్కుతుంది. చీకటిలో నుండి చీకటియే, వెలుతురు రాదు. వెలుతురు వచ్చినప్పుడే చీకటి దూరమవుతుంది. చీకటి ఉండినపుడే తరువాత వెలుతురు ప్రకాశిస్తుంది. చీకటి లేకపోతే, వెలుతురికి ఏమాత్రము ప్రకాశము లేదు. దుఃఖమే లేకపోతే సుఖమునకు ఏమాత్రము విలువలేదు. కనుక మన సుఖమనేటువంటిది దుఃఖము ద్వారానే మనకు లభించేటువంటిది కాని, సుఖమునుండి సుఖము లభించదు. ఇట్టి పవిత్రమైనట్టి ఆదర్శాన్ని జగత్తుకు చాటి నిరూపించాడు. ప్రతి ఒక్కటి కూడను తాను ఆదర్శంగా నిరూపించాడు. వ్యక్తి ధర్మము, కుటుంబ ధర్మము, సమాజ ధర్మము యీ మూడింటియొక్క ధర్మములు తాను అనుభవించి నిరూపించాడు.

### మొట్టమొదట సాధించవలసినది వ్యక్తిధర్మమే

కనుకనే వ్యక్తిగతమైనట్టి ఒక్క ధర్మాన్ని మనము మొట్టమొదట సాధించాలి. నేను వ్యక్తిగా ఉంటున్నాను. వ్యక్తి అనగా ఏమిటి? అవ్యక్తమై గూఢముగా ఉన్నటువంటి ఒక

sri sathyasai vahini amrutam

దృఢత్వాన్ని ఎవరు వ్యక్తీకరింప చేస్తారో, అతడు మాత్రమే వ్యక్తి. ప్రతి ఆకారము ధరించినట్టివాడు వ్యక్తి కాడు. అవ్యక్తమై దృఢముగా ఉన్నటువంటి ఒక దివ్యత్వాన్ని ఎవరు నిరూపిస్తారో వారు మాత్రమే వ్యక్తి అన్నారు. కనుకనే రాముడు వ్యక్తిగా ఉంటుండి, తన యందున్నటువంటి దివ్యశక్తిని నిరూపించి, ఆ పవిత్రమైనట్టి ఒక ఆదర్శాన్ని నిరూపించాడు. ఆదర్శంగా ఆచరించాడు. కనుక రామతత్త్వమనేటువంటిది చెప్పారు పర్వతము, నదులు, ఉండినంతవరకు కూడను రామాయణము నిలచి ఉంటుందని. బ్రహ్మ వాక్కు కాబట్టి రామాయణమనేటువంటిది పర్వతములకు, నదులకూ సంబంధించినట్టిదా యిది? కాదు కాదు. బ్రహ్మయొక్క భావము ఆ విధముగా లేదు. పర్వతము అనగా పురుషుడు. నదులు అనగా స్త్రీలు. స్త్రీ పురుషులు ఉండినంతవరకు కూడను రామాయణము నిలచి ఉంటుంది. కనుకనే స్త్రీ పురుషులు లేకుండా యీ జగత్తు ఉండడానికి వీలుకాదు. కనుకనే రామాయణము లేకుండా ఉండడానికి సాధ్యంకాదు. ఇలాంటి శాశ్వతమైన, సత్యమైనట్టి, నిత్యమైనట్టి యీ రామతత్త్వాన్ని గ్రహించడానికి తగినటువంటి శక్తి సామర్థ్యములు సంపాదించుకోవాలి. కనుక యిందులో ఉన్నటువంటి రహస్యాలు ఎన్ని ఉండినప్పటికినీ, భారతీయులే యీ రహస్యాన్ని గుర్తించుకొనలేక, భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైనట్టి ధర్మముచేత హీనత్వంతో కాలము వ్యర్థం చేసుకుంటున్నారు. ఈనాడు రాముని పుట్టిన దినము అనుకుంటూ ఏం చేస్తున్నాము? ఆనాడు ఒక ప్రత్యేకమైనటువంటి ఒక పూజ, ఆనాడు బొట్టు పెట్టుకోవడము ఈ బొట్టు పెట్టుకోవడానికి, ప్రత్యేకమైన పూజ చేయడానికి జన్మదినము రావలెనా? కాదు కాదు. ఏ వయసైనప్పటికిని, నిత్యము, సర్వదా సర్వకాలేషు సర్వత్రా రామ చింతనం చేయాలి.

**లవకుశుల ఆదర్శం యువత గ్రహించాలి**

వాల్మీకి రామాయణం వ్రాసాడు. వ్రాసిన తర్వాత శిష్యులందరినీ పిలిచాడు. ఈ సార్థకమైన, దివ్యమైన, భవ్యమైన, పవిత్రమైన ఒక రామకథను వీధి వీధికి, యింటి యింటికిని కూడను చాటేటంటి వారెవరు? అని విచారిస్తూ వచ్చాడు. శిష్యులందరు కూడను నిరాశకు గురి అయ్యారు. గురూజీ! మా వయసు పండినది. మాయొక్క ఆయుఃప్రమాణము

sri sathyasai vachanamrutam

నిండినది. మేము వీధి వీధికి తిరిగి రామకథను బోధించడానికి తగినటువంటి శక్తి సామర్థ్యములు శారీరకముగా మాకు లేవు అని చెప్పేటప్పటికి వాల్మీకి నిరాశ పడిపోయాడు. ఈ సంభాషణలు జరుగుతున్నప్పుడు లవకుశులు వచ్చారు. 'గురూజీ! ఇంతసేపు మీరు శిష్యులతో సంభాషిస్తున్న విషయము మేము విన్నాము. ఈ కార్యాన్ని పరిపూర్ణం కావించడానికి మాకవకాశం యివ్వండి అన్నారు. వీరెవరు? రాజపుత్రులు, ప్రియశిష్యులు ఇలాంటివారు తంబూర చేతపట్టి, నామములు పెట్టి, చిడతలు చేబట్టి, వీధి వీధికి పాడుతూ వెళ్ళారు. ఈ విధంగా యీనాడు మీరు చేయగలరా? ఏదైనా భజనకు పోయి ఏదైనా ఒక పాట పాడినారంటే ఓహ్! ఈయన భజనకూడ పాడుతున్నాడని గేలి చేస్తారని భయము. ఇంకేమైనా కొంచెం విభూతిని కనుక పెట్టుకుంటే ఓహ్! ఈయన సాయిబాబా భక్తుడా అంటారేమోనని భయము. భజన చేస్తున్నప్పుడు తాళం వేస్తే ఓహ్! ఈయన భజన స్వరూపడైనాడా అంటారు. ఇలాంటి అభిమానానికి, మమకారానికి ప్రాణాలు యిస్తున్నారీనాటి మానవులు. అహంకార, మమకారములు ఏనాడు మనము త్యాగము చేస్తామో, ఆనాడే సమాజమునకు సౌభాగ్యము చేకూరుతుంది. ఈ అహంకార, అభిమానాలు మనం త్యజించాలి. ఇవి ఉన్నంతవరకు భగవత్ నామాన్ని కూడను మనము స్మరించలేము. ఎవరో ఏదో అంటారనే భయము మనకెందుకు? నువ్వు పనులు చేయరానివంటి వన్నీ చేస్తున్నావు. వీనికంత భయము లేదే నీకు? పవిత్రమైనట్టి భగవన్నామాన్ని చేయడానికి ఎందుకు భయము? తప్పులకు మనము భయపడాలి కాని మంచికి భయపడనక్కరలేదు. కనుకనే ఈనాటి లోకము యిలాంటి దురవస్థలకు గురి అయిపోయింది.

**త్యాగమే నిజమైన భోగము**

**పాపభీతి లేని పామరత్వముబట్టి**
**దైవప్రీతి లేనిదారి పట్టి**

sri sathyasai vachanamrutam

**మావత్వమణగె మానవులందున**
**ఇదియె స్వార్థమునకు మూలకారణంబు.**

పాపభీతి లేదు, దైవప్రీతి లేదు. ఇంకెట్లా మనలో త్యాగమొస్తుంది? మనలో త్యాగము రావాలి. త్యాగమే మన నిజమైనట్టి భోగము. ఈ భోగములే మనకు నిజమైనట్టి రోగములు. కాని యీనాటి మానవులంతా రోగములకైనా గురి అవుతున్నారే కాని, త్యాగమునకు సిద్ధపడుటలేదు. ఎవరైనా కానీ, 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః ' ఇట్టి అమృతత్వాన్ని బోధించాలంటే యిటువంటి త్యాగానికి మనం సిద్ధం కావాలి. ఒక చెఱకైనను కూడను మనము కష్టపడి నమిలి పెట్టిన తర్వాతనే కదా ఆ తీయని రసము మనలో ప్రవేశిస్తుంది. కనుక మనము కష్టపడినపుడే ఆ సుఖము మనకు ప్రాప్తిస్తుంది. 'తరువ తరువ తన్మయత్వం పొందు'. మనము ఒక విధమైనట్టి కర్రను కనుక రాపిడి చేసినపుడు అందునుండి అగ్ని ప్రవేశిస్తుంది. చిలకంగా చిలకంగా పాలలో నుండి వెన్న బయలుదేరుతుంది. అదే విధముగనే స్మరించగా స్మరించగా దివ్యత్వం ఆవిర్భవిస్తుంది. ఈ స్మరించకుండా దివ్యత్వము మనలో ఆవిర్భవించడానికి అవకాశమే లేదు. 'తరువ తరువ బుట్టు తరువున అనలంబు'. ఈ విధముగ రెండునూ చేరినప్పుడే అగ్ని ప్రవేశిస్తుంది. ఆ శక్తియే సాక్షాత్ జ్ఞానము. దీనిని రామాయణమునందు 'జ్ఞానాగ్ని' అని బోధించారు. ఈ అగ్ని అనేటటువంటిది ఎవరియందు ఆవిర్భవిస్తుందో వానియందు పాపములు ఏమాత్రము కూడ వుండవు. కొండలవంటి పాపములుకూడను అణుమాత్రమైన నిప్పుకూడ భస్మం చేస్తుంది. కనుక ఏ నామము తలంచినప్పటికిని, హృదయ పూర్వకంగా తలచినపుడు దానియొక్క ఫలితము మనకు లభిస్తుంది. కాని, ఈనాడు మనము నామము స్మరిస్తున్నామే కాని, హృదయపూర్వకంగా లేదు. ఏదో ఒక విధమైనట్టి ఒక ప్రాకృతమైన దీనితో మనము స్మరిస్తున్నాము. ఇది సరియైనట్టి ఫలితానికి అవకాశము అందించదు. ఫలితము కూడ వుండదు. ఎందుకసలు శ్రమ పడాలి? చిత్తశుద్ధి లేని శివపూజ దేనికి? ఆత్మశుద్ధి లేని ఆచారమది యేల? పాకశుద్ధి లేని పాలిక మది యేల? ప్రతి వ్యక్తి కూడను ఒక చిత్తశుద్ధితో చేయాలి. ఆ చిత్తశుద్ధి లేకుండా చేసినటువంటిది ఏమాత్రము కూడ ఫలితము ఉండదు. కనుక రామాయణమునందు అనేక విధములైనటువంటి ఆదర్శాలనంతా నిరూపిస్తూ

srisathyasaivachanamrutam

వచ్చింది.

**రామ నామ మహత్వము**

నేను మొన్న మద్రాసు వెళ్ళినపుడు దీనిని అక్కడ చెప్పాను. ఒకానొక సమయములోపల, ముగ్గురు తల్లులు ఏకమైనారట. రాముడి తల్లి ఒకామె. హనుమంతుని తల్లి ఒకరు. అగస్త్యుని తల్లి ఒకామె. "ముగురాడు వారు చేరిన సుగుణాకర పట్ట పగలు చుక్కలు రాలున్" అన్నారుట. ఈచేరినట్టి వారు ఊరకనే ఉండకూడదా? ఎవరిని అడిగిందట కౌసల్య హనుమంతుని తల్లిని. "అమ్మా! నీకు తెలియదా? యావత్ ప్రపంచమునకే తెలిసినట్టి కుమారుడు హనుమంతుడు. హనుమంతుని నామము జపించిన చోట రాముడుంటాడు. రామనామము చెప్పిన చోట హనుమంతుడుంటాడు. రామ, హనుమంతులు అన్యోన్య అనురాగము అవినాభావ సంబంధము. ఏకాత్మ తత్త్వము. అటువంటి హనుమంతుని యొక్క తల్లిని నేను అన్నది. ఓహో! అతనే యీ లంకనంతను చేరడానికి పెద్ద సముద్రమునంతా కూడను దాటిపోయాడు అనింది. ఈ మాట వినేటప్పుటికి, అగస్త్యుని తల్లి "ఓహో! నీ కుమారుడు చేసినట్టి పని గొప్పదేమీ కాదు. సముద్రాన్ని దాటినవాడు నీ కుమారుడు. నా కుమారుడు సముద్రాన్నే మ్రింగి వేశాడు". అలాంటి అగస్త్యుని తల్లిని నేను అన్నది. ఇద్దరూ చేరి కౌసల్యను ప్రశ్నించారట, 'నీవెవరమ్మా' అని. అమ్మా! ఏ హనుమంతుడు లంకను దాటాడో, ఏ అగస్త్యుడు ఈ నీటినంతా కూడను మ్రింగాడో. ఆయొక్క శక్తి రాముడు. ఆ కుమారునియొక్క తల్లిని' అన్నాదట. ఈ ప్రశ్నల సంభాషణ అయినలోపల రాముడు ప్రవేశించాడట. "ఏమిటమ్మా! ఇంత గొప్పగా చెప్పుకుంటున్నారు, నా విషయము అన్నాడు. అమాయకునివలె ప్రశ్నించాడు వాళ్ళను. తాను దైవస్వరూపుడై నప్పటికిని, సాక్షాత్తు నారాయణుడయినప్పటికిని, అమాయకునివలె తాను ప్రవర్తిస్తూ వచ్చాడు. 'అమ్మా! హనుమంతుడు తన భక్తి ప్రపత్తులతోనే లంకను దాటాడు. అగస్త్యుడు తన భక్తి శ్రద్ధలతోనే ఆ జలమునంతా మ్రింగాడు. నేను కాదు. నేను గొప్పవాడను కాదు. నేను సామాన్యుడైన మానవుడను, నాయొక్క యీ దేహమునకు పెట్టిన నామమే సర్వశక్తి స్వరూపము అన్నాడు. నేను కేవలము నిమిత్త మాత్రుడను. ఆ నామము

srisathyasaivachanamrutam

సర్వము కూడను సంకోచింప చేస్తుండాలి. సర్వశక్తి కూడను ఈ నామమునందే ఉంటుండాలి. ఈ నామముయొక్క మహత్తర శక్తి చేతనే ఈ దేహము కూడ కదలిపోతుండాలి. కనుక నేను నిమిత్తమాత్రునిగా తీసుకోమన్నాడు. ఈ విధముగా రాముడు చెప్పిన తక్షణమే కౌసల్య చెప్పింది. అమ్మా! నా కుమారుడు అమాయకునివలె మాట్లాడుతుంటాడు. అతనికి తెలియనట్టి జ్ఞానము అతను చెయ్యనటువంటిపని, లేదు సర్వము కూడ అతనియందే ఉంటుంది.

ఇలా చెప్పినటువంటి తల్లి, యీ కైక ఆశలవల్ల రాముడు అరణ్యాలకు పోవలసి వచ్చింది. అరణ్యాలకు పోవలసి వచ్చినప్పుడు, కౌసల్య దగ్గరకు వచ్చాడు. ఎప్పుడు వచ్చాడు? సీత దగ్గరకు వెళ్ళి, తాను పట్టాభిషేకం ధరించే వస్త్రములు విడచి, నారవస్త్రము ధరించి, తల్లి దగ్గరకు వచ్చాడు. తల్లి ఎంతో ఆనందముతో ఎదురుచూస్తు ఉండినాది. అప్పుడు తల్లికి చెప్పాడు. అమ్మా! నీకొక్క ఆనందమైన వార్త చెప్పడానికి వచ్చాను, అన్నాడు. అయోధ్యకు కాదు నేను రాజును. అరణ్యానికి నేను రాజును. ఈ నిముషమే నేను అరణ్యానికి రాజుగా తయారవుతున్నాను. ఆమె కేమీ అర్థం కాలేదు. ఎందుకీవిధముగా చెప్పున్నాడు? వెంటనే వచ్చాడు లక్ష్మణుడు. వ్యక్తిని నీడ అనుసరించినట్టుగా, రాముని లక్ష్మణుడు నీడవలె అనుసరిస్తుంటాడు. అదే విధముగనే భరతుని శత్రుఘ్నుడు నీడవలె అనుసరిస్తుంటాడు. ఈ శత్రుఘ్నుడు, లక్ష్మణుడు ఒక తల్లి బిడ్డలు. ఒకరు రామునికి శిష్యుడైయ్యాడు, ఒకరు భరతునికి శిష్యుడైనాడు. ఈ యిరువురుకూడను ఎంతో వినయ విధేయలతో ఉన్నట్టి వారో, చిత్తశుద్ధి కలవారు. మానసిక పవిత్రము కలవారు. అలాంటి లక్ష్మణుడు వచ్చి, చాలా ఉద్రేకపడిపోయాడు. "అన్నా! ఈ శాంతము ఉండవలసినదే కాని యిలాంటి విషయములో కాదు. లోకమంతా నిన్ను ఆశిస్తున్నాది. ఒక్క వ్యక్తి నిమిత్తమై నీవింత వెనుకకు పోతున్నావు. నేనొప్పుకోను. నీవిక్కడే ఉండు. ఒక్క నిముషములోపల నేను ఆ కైకను, దశరథుని హతమార్చి, పట్టాభిషేకం చేస్తాను" అన్నాడు. అని చెప్పేటప్పటికి లక్ష్మణునికి రాముడు చెప్తున్నాడు. 'లక్ష్మణా! ఉద్రేకము మంచిదికాదు. శాంతించు, శాంతించు. ఈ శాంతమే మనకు రక్ష. ఈ శాంతమే మనకు భిక్ష. శాంతియే మన స్వభావము. శాంతమే మన కిరీటము. కనుక శాంతమనేటి కిరీటాన్ని మనం ధరించాలి" అన్నాడు.

**క్షమ సత్యము క్షమ ధర్మము**
**క్షమ యోగము క్షమయహింస క్షమ యజ్ఞమగున్**
**క్షమయాచారము క్షమ దయ**
**క్షమయే ఆధారమగును సర్వంబునకున్.**

అన్ని లోకములందుకూడను క్షమయే ఉండాలి. ఆ క్షమనే మనం వహించవలసినది. క్షమనే మనము వరించవలసినది. కనుకనే యోగులయొక్క శిరస్సును ధరించినట్టి యొక కిరీటము క్షమనే. కనుక నీవు శాంతిని పొందు. అని చెప్పిన తర్వాత, లక్ష్మణుడు, కౌసల్యకు చెప్పాడు జరిగినదంతా. అప్పుడు కౌసల్య కూలబడిపోయింది పాపం. రామా! నిన్ను వదలి క్షణమైనా ఉండలేము. నీవు తండ్రి యాజ్ఞ శిరసావహించినావు. దానికి కాదని చెప్పను. కానీ, నన్ను కూడ నీవెంట తీసుకెళ్ళు అంది. అప్పుడు చెప్పాడు రాముడు. సతికి పతియే దైవము. కావున పతిని వదలి నీవు ఏమాత్రము రావడానికి వీలులేదు. పతియే నీ సర్వస్వము. కనుక జీవితమున్నంతవరకు అతనిని వదలడానికి వీలులేదు. అతనిని సేవించి, నా వియోగము వలన దుఃఖములో మునిగి పోతున్నాడు కాన నీవుండి అతనికి తగినటువంటి శాంతిని బోధిస్తూ ఉండమన్నాడు.

వెంటనే వచ్చింది సీత చెప్పింది ఆమె సామాన్యురాలు కాదు. జనక మహారాజు పుత్రిక. వైదేహి అనిన దేహభ్రాంతియే లేదు, కనుకనే ఆమెను వైదేహి అని పేరు పెట్టారు. ఫక్కున నవ్వింది సీత. 'రామా! నాకొక బోధ, నీ తల్లికొక బోధనా? నేను నీవెంట వస్తానంటే రావడానికి వీలుకాదని నాకు చెప్పావు. వృద్ధులైన తల్లితండ్రులుంటున్నారు. వారిని సేవించి, నీవు జీవించు అన్నావు. నీ తల్లి దగ్గరకు వచ్చేసరికి, పతియే దైవము అంటున్నావు. నాకు మాత్రము నీవే దైవము కాదా? ఒక స్త్రీకి ఒక ధర్మము. మరొక స్త్రీకి మరొక ధర్మమా? నేను దీనికి అంగీకరించను' అంది. ఇంతియే కాకుండా రామచంద్రుడు అరణ్యములో, సీత అయోధ్యలో ఉండడానికి వీలువుతుందా! చంద్రుడెక్కడో, ఆ వెన్నెల చల్లదనము కూడ అక్కడే వుండాలి. కాన సీత, నన్నుకూడా తీసుకెళ్ళమని చెప్పింది. ఈ విధమైనట్టి విధులను సరిచేస్తూ రాముడు క్రమక్రమేణా కూడను తల్లులయొక్క సమాధానము, భార్యయొక్క సమాధానములు సర్వంకూడను సరియైనట్టిదిగా సరిచేస్తూ వచ్చాడు. ఇదియే



sri sathyasai vahini vachanamrutam

కుటుంబధర్మము, తగినట్టి యుక్తిని కూడ పన్నవలసి వస్తుంది. యుక్తి అనగా ఏమిటి? దీనికి ఒక యోగము అని పేరు. పరులను మోసగించేటువంటిది కాదు. ఆదర్శముగా నిరూపించేటువంటిదే యిది. కనుకనే యిది యోగముగా మారిపోయింది. 'యోగః చిత్తవృత్తి నిరోధః' వారికున్నటువంటి చిత్తవృత్తి నిరోధము కావించే నిమిత్తమై యిది ఒక యోగముగా మారిపోయింది. ఈ విధముగా తల్లులను సమాధానం చేసి, కుటుంబ గౌరవాన్ని నిలబెట్టి, అరణ్యానికి వెళ్ళాడు.

ఈ అరణ్య సమయమునందు కూడను అనేక విధములైనట్టి రాక్షస కృత్యములను చూచి, ఈ పరిపాలన నిమిత్తమై నా తండ్రి అరణ్యానికి అధికారిగా నన్ను చేసినాడు. ఈ రాక్షసులు కూడ యతులయొక్క సవ్యమైనట్టి సాధనకు అడ్డు తగులుతున్నారు. కాబట్టి యీ యతులయొక్క సాధనలు ఏమరకుండా యీ రాక్షసులను చంపాలి. అయితే యీ రాక్షసులను సంహరించుట అనేటువంటి సమయములోపల ఒక ఇబ్బంది అడ్డు వస్తున్నది. స్త్రీలైన రాక్షసులను కూడ సంహరించవచ్చా? పూర్వము విశ్వామిత్రుని యజ్ఞసంరక్షణకై అక్కడకు వెళ్ళినపుడు, యీ తాటకిని సంహరించాలనుకున్నప్పుడు తాను యోచించాడు. గురూజీ! ఈ స్త్రీయైన తాటకిని చంపవచ్చునా? చంపవచ్చు అన్నాడు, సాధనలకు, తపస్సునకు, ఋషులకు ఆనంద భంగము కావించే రాక్షసులైన స్త్రీలను కూడ చంపవచ్చును అన్నాడు. ఏమీ తెలియనట్టు రాముడు అడుగుతున్నాడు. గురూజీ! ఈ విధంగా ఎవరైనా సంహరించినట్టి వారున్నారా రాజులలో?' అన్నాడు. 'పిచ్చివాడా! ప్రహ్లాదుని మనుమడైనట్టి విరోచనుడికి పుట్టిన బిడ్డ ఒకటుంది. ఆమే స్త్రీనే. ఆమె పేరే మంథర. ఆ మంథర అనేక రకములైనటి ఋషులను హింసించి, తన వాంఛ నిమిత్తమై ఇతర ఋషులనంతా కూడను సంహరించి అనేక పాపములకు గురియై పోతూ వచ్చింది. ఆ సమయములోపల రాజే ఆమెను చంపించాడు. కాని అది దోషము లేదు. ఎవరైనా సరియే దైవత్వానికి అడ్డు తగిలినప్పుడు వారు ఎవరు ఏ విధముగా చేసినా తప్పులేదు.

**దైవ మార్గానికి అడ్డు వచ్చేది ఏదైనా వదలవచ్చు**

ఇదే, మీరా సమయమునందు కూడ, ఇలాంటి ధర్మము ఒకటి అడ్డు ఉంది.



sri sathyasaivachanamrutam

మహారాణా తన మందిరాన్ని వదలి వెళ్ళిపొమ్మన్నాడు. ఒక్క క్షణము అతనికి బాధ వేసింది. ఎక్కడైతే ఏమి! నా కృష్ణుని వదలి ఏవిధంగా వెళ్ళాలి అని అక్కడ కూర్చుని ఒక జాబు వ్రాసింది, తులసీదాసుకు. అతను చిత్రకూట పర్వతముపై నున్నాడు. ఒక మనిషినిచ్చి పంపించిది. అప్పుడు అతని మనిషి ఆ విధంగా జవాబు తీసుకొని వచ్చాడు. 'అమ్మా! మీరా! నేను భర్తని వదలిపెట్టి ఏ విధముగా వెళ్ళాలి అని వ్రాసావు. ఇది ధర్మమా, కాదా మీరు నిర్ణయించాలని వ్రాసావు. ఉన్నదంతా మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ. కాని అన్నీ నిజంగా దైవస్వరూపాలే. కానీ దైవానికే అడ్డు తగిలినపుడు తల్లైనా సరే, తండ్రైనా సరే, గురువైనా సరే, ఎవరైనా సరే త్యజించవచ్చును. దైవమైన శ్రీరామచంద్రుని అరణ్యానికి పంపించి, నా ఆరాధ్యమైన అన్నను యిపుడు అరణ్యపాలు చేసి, నాకు పట్టాభిషేకము చేయడానికి ఈమె యిక్కడకు వచ్చింది. ఛీ! ఇలాంటి తల్లిని నేను చూడను అని భరతుడు తల్లిని విస్మరించాడు. తల్లితో క్లేశము కావించుకున్నాడు తల్లినైనా వదులు తాను కాని నేను రామున్ని వదలనన్నాడు కనుక తల్లినికూడ వదలి పెట్టినట్టివాడు భరతుడు. ఇంక ప్రహ్లాదుడెలాంటి వాడు? తండ్రి క్షణక్షణము కూడను అనేక హింసలు పెట్టి, ఆ హరి నామమును మానమని చెబుతూ వచ్చాడు. నాన్నా! నిన్నైనా వదులుతాను కాని హరినామాన్ని వదలను, నీవు హరిద్వేషివి. నేను హరి ప్రియుణ్ణి. నేను నా ప్రియమంతా కూడను హరిపైనే ఉంటుండాలి అని చెప్పి తండ్రి మాటనంతా ధిక్కరించి హరిని స్మరిస్తూ వచ్చాడు.

ఇంక యిప్పుడు గురుద్వేషము. గురుద్వేషము ఎక్కడొచ్చిందో తెలుసా? వామనుడు వచ్చి బలిచక్రవర్తి దగ్గరకు వచ్చి దానమడిగినప్పుడు తాను ఒప్పుకున్నాడు. కాని దివ్యశక్తితో చూచిన తన గురువైన శుక్రాచార్యుడు దీనికి అంగీకరించలేదు. అప్పుడు నాయనా! బలిచక్రవర్తీ! ఇది నీవు చేయకూడదు. ఇతడు సామాన్యుడైన బ్రాహ్మణుడు కాడు. ఇతడు కేవలము సాక్షాతు భగవంతుడే వచ్చాడు. ఇంకా ఆనందము గురూజీ! గురువులకు గురూజీనే వచ్చి, అనగా భగవంతుడే వచ్చి, తన చేయిచాపి నాకు యిమ్మని కోరినప్పుడు, తన చేయి క్రింద నా చెయిపైన యిది కావడం ఎంత అదృష్టం నాది? కనుక గురువైన శుక్రాచార్యుని ఆజ్ఞకూడను మీరాడు బలిచక్రవర్తి. కాని, ఆచార్యా! పలికి బొంకుటకంటే

srisathyasaivachanamrutam

పాపముందా అన్నాడు, బలిచక్రవర్తి. ఎవరికోసం? భగవంతుని కోసం నేను అర్పితము చేస్తున్నాను. భరతుడేమి చెప్పాడు! భగవంతుడైన రామున్నే నేను ఆశిస్తున్నాను. భగవంతుని విషయంలోపల ఏ తప్పులు కూడ కనిపించడానికి వీలులేదు. సర్వసంగ పరిత్యాగి అయినట్టివాడే నిజమైన భక్తుడు. ఇలాంటి తల్లి, తండ్రి, గురువు ఈ రకమైన వాటికి అవకాశమే యివ్వకూడదు. ప్రాపంచిక విషయములోపల యీ దివ్యమైనటువంటి ఒక మార్గము లేకుండా, లౌకికమైన జీవితములో యివన్నీ మనము ప్రమాణములు తీసుకోవాలి. కాని దైవములో మనము ప్రవేశించే సమయములో ఏదికూడా మనకు అక్కరలేదు. అన్నింటికన్నా గొప్పవాడు దైవమే. దైవమును మించినట్టిది మరొకటిలేదు. దానికోసం సర్వము మనము అర్పితము చేయవచ్చును అని ఆ జాబు వ్రాసి పంపాడు. అపుడే ఆమె. 'చలోరే మన్ గంగా జమునా తీర్... చలోరే మన్' ఏ మనసా! నీవు వెళ్ళు. బయలుదేరు. ఎక్కడకు వెళ్ళిపోయింది? ద్వారకకు వెళ్ళిపోయింది. కనుకనే గొప్ప కీర్తిని సాధించింది. ఆమెకు ఏ ప్రపంచవాంఛలు లేవు. ఏ ప్రాకృతమైన యిష్టములు లేవు. ఇలాంటి పవిత్రమైన జీవనమునకు దోషాలు ఎక్కడ అంటుతాయి? దోషములు దగ్గరకుకూడా రావు. అలాంటి పవిత్రమైనటువంటి హృదయాలకు భర్తను వదలిపెట్టి ఉండడమంటే అది సాధ్యమవుతుందా? కనుకనే సీతకూడా రాముని వెంట వెళ్ళిపోయింది.

ఈయొక్క రాముడుకూడను, యీయొక్క స్త్రీలనే దయను, దాక్షిణ్యము లేకుండా, రాక్షసులను చంపాడు. ఇంతేకాదు, ఆ బలిచక్రవర్తి కుమారుడైనట్టి వాడు, తన కుమారునకు బిడ్డలు కూడా ఉన్నారు. ఎవరు? మంథర. మొట్టమొదట యీయొక్క బలిచక్రవర్తిని చూచినపుడు, ఎంతో ఆనందపడింది. బలిచక్రవర్తి వద్దకు చిన్న వామనుడై నడచి వస్తున్నాడు, శ్రీమన్నారాయణుడు. చిన్నవాడుగా వస్తుంటే. అయ్యో! అలాంటి కొడుకుంటే ఎంత బాగుండును? అని ఆశించింది. ఇలాంటివాడు నా పుత్రుడిగా పుట్టాలని ఆశించింది. కాని తన తాత తలపైన కాళ్ళుపెట్టి పాతాళలోకానికి నెట్టే సమయంలోపల ఛీఛీఛీ! ఇలాంటి వాణ్ణి చంపాలి అని అనుకుంది. అందుకే అదియే, ద్వాపరయుగములోపల పూతనగా వచ్చి అతని తల్లిగా భావించుకొని, తన కొడుకుగా భావించి, అతనికి పాలిచ్చి, అతనిని చంపాలని, తిరిగి చంపబడిపోయింది. ఈ విధమైనట్టి సంకల్పములు పవిత్రముగా

srisathyasaivachanamrutam

ఉన్నా, అపవిత్రమైనట్టివిగా ఉన్నా వాటి ఫలితమేమో ఫలిస్తూ ఉంటుంది. ప్రతి మానవుడు కూడను తన సంకల్పాలను పవిత్రమైనట్టి సంకల్పాలుగా పెట్టుకోవాలి. దైవభావములుగా అభివృద్ధి గావించుకోవాలి. ఇది చెడ్డని, యిది మంచని ఏ విధముగా కూడ విచారించకూడదు. అన్నీ దైవముయొక్క ఆకారమే. అన్నీ దైవముయొక్క ప్రేమతత్త్వమే. అన్నీ దైవముయొక్క ఆజ్ఞలే అని సమత్వముగా భావించి రామతత్త్వాన్ని మనం విశ్వసించి, రామ మార్గాన్ని అనుసరించినప్పుడు మీరు రమించినట్టి దైవత్వముగా రూపొందుతారు. నీవు దైవత్వాన్నే పొందుతావు. 'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి' ఎవరిని నీవు స్మరిస్తున్నావో, ఆ దైవముగానే నీవు రూపొందుతావు.

**సముద్రపు అలలనైనా లెక్కించవచ్చు కాని రాముని లీలలకు లెక్కే లేదు**

కనుక రామతత్త్వమనేది చెప్పాను. సముద్రమునందు అలలనైనా లెఖ్ఖించుకోవడానికి సాధ్యమవుతుంది కాని, రామునియొక్క లీలలు ఎంచడానికి వీలుకాదు. అనంతమైనటువంటి శక్తులున్నాయి. అనంతమైనటువంటి లీలలున్నాయి. ఈ దైవము దగ్గర లేనటువంటివి యింకెక్కడా లేవు. దైవమనేంటిది మనిషి రూపములోనే రావాలి. ఎందుకోసము? మనుషులకే బోధించాలి. పశుపక్ష్యాదులు కూడను కాలానుగుణ్యముగా ప్రవర్తిస్తున్నాయి. తమ ప్రాకృతమైన ధర్మాన్ని తాము అనుసరిస్తున్నాయి. కాని మనిషియే ప్రకృతియొక్క సంబంధమైనట్టి ధర్మానికి విరుద్ధముగా అనుసరిస్తున్నాడు. కనుకనే సృష్టికి సంబంధించినట్లు సహజంగా నడిచేవాళ్ళను దైవము కూడ క్షమిస్తుంటాడు. కనుక పశుపక్షి మృగాదులను శిక్షించడానికి రాలేదు భగవంతుడు. పశువులు కూడ తమ సీజన్, తమ రీజన్ చక్కగా పాటిస్తున్నాయి. కానీ, మానవుడు దీనికి విరుద్ధముగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విరుద్ధంగా ప్రవర్తించే వారిని శిక్షించడానికి వచ్చాడు భగవంతుడు. శిక్షించడమంటే పనిష్మెంట్ కాదు. ఒక సక్రమమైన మార్గాన్ని బోధించడమే. ఒక ఆదర్శవంతమైన జీవితాన్ని అందించడమే. నవ్యమైన జీవితాన్ని పోషించడమే.

కనుక ప్రేమస్వరూపులారా! భగవంతుడు కేవలము లోకోద్ధరణ నిమిత్తమై వచ్చేటటువంటివాడే కాని, తన నిమిత్తమై తాను వచ్చేటటువంటివాడు కాదు. తన కేమి

sri sathyasai vahini amrutam

కావాలి? ఏమీ అక్కరలేదు. సర్వమూ తన హస్తమునందే ఉంటుంది. కాని సర్వులకు యీ మంచి మార్గాన్ని బోధించి, జ్ఞానాన్నివ్వాలి, మీరందరు కూడను దైవమునుంచి వచ్చినవారే. దైవములోనే లీనంకండి. నిజముగా ఒక ప్రేమతత్త్వమే ప్రధానమైనట్టిది. ఈ ప్రేమతో ఎన్నైనా సాధించవచ్చును. దేనినైనా సాధించవచ్చును. పర్వతాలు కూడను ఒక మంచువలె మాయం చేయవచ్చును.

కనుక ఒకానొక సమయంలో సీత అశోకవనంలో ఉంది. అశోకవనంలో ఉండినప్పుడు రావణుడు అనేక విధములైనట్టి మాయకారులను సృష్టించి, యీ సీత నా చేతికి చిక్కడం లేదు. ఈమెకు రాముని తలవంటి దానిని ఒకటి కొట్టి దానిని సీతకు చూపించమని చెప్పాడు. ఈయొక్క మాయకారి రామునియొక్క తలను తీసుకొని పోయి అక్కడ చూపించాడు సీతకు. సీత చాలా భయపడిపోయింది. తక్షణమే ప్రక్కన ఉన్న సరమ, విభీషణుని భార్య ఆమె చెప్పింది. 'అమ్మా! మీరు భయపడనక్కరలేదు. ఇదంతా రాక్షసమాయే యిది. ఇది ఏమాత్రము కూడను శ్రీరాముని జయించడానికి ఎవరికి సాధ్యంకాదు. శ్రీరాముని తల కొట్టడానికి యీ జగత్తులో ఎవరికినీ అధికారములేదు. శ్రీమన్నారాయణ మూర్తి శ్రీరాముడు. మీరు కూడ శ్రీలక్ష్మీ స్వరూపులై ఉండి మీ శ్రీరాముని గుర్తింపలేకపోతున్నారు' అని చెప్పి తాను మ్రొక్కింది తాను. ఆ శిరస్సు మాయమై పోయింది. అప్పుడు తెలుసుకుంది సీత. సీతకు కూడ తెలుసును. కాని ఆమెకు కూడ యీయొక్క సామాన్యమైనట్టి జీవితములో జీవించడానికి ఆశపడి, ఆ విధముగా నటిస్తూ వచ్చింది. కనుక రాక్షసులు ఎన్ని మాయలైనా పన్నుతారని ఆ మాయ లోపల ఏమాత్రము లొంగకూడదు. దైవము మాయ అనేటివి ఎప్పుడూ శాశ్వతమైనట్టివి. అదియే నిత్యము, సత్యమైనట్టివి. అటువంటి సత్యమైనటువంటి దానికి ఏమాత్రముకూడను భయపడనక్కరలేదు.

**మానవత్వాన్ని దివ్యత్వంగా అభివృద్ధి పరచుకొండి**

దైవము ఒక మానవాకారములో వచ్చి, మానవులనంతా కూడ ఉద్ధరించి, జగత్తంతా వ్యాప్తి గావించి, దైవమయంగా మారుస్తూ వస్తున్నాడు. ఇదే మనము యీనాడు



srisathyasaivachanamrutam

తెలుసుకోవలసినది. శ్రీరామనవమి అని యీ ఒక్క దినము మాత్రమే మనము పూజించి, యీ ఒక్క దినమే మనము పాయసం, పరమాన్నం తింటే ప్రయోజనము లేదు. క్షణక్షణముకూడ భగవంతుని అవతారమే. ఎందుకంటే, యీ జగత్తులో క్షణక్షణముకూడ పుడుతున్నాడు మానవుడు. ప్రతి పుట్టిన మానవుడు కూడను అవతార స్వరూపుడే.

**సర్వత పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి.**

కనుక పుట్టిన ప్రతివారు కూడ భగవత్స్వరూపులే. ఎందుకంటే 'ఈశ్వరః సర్వభూతానాం' అందరియందు ఉండినట్టివాడు భగవంతుడే. కనుక మనము క్షణక్షణము భగవంతునియొక్క చింతన చేస్తూ రావాలి. ఈ విధముగా స్మరణ చేసినపుడే ఈ దివ్యత్వమనేది మనకు సాక్షాత్కారిస్తుంది. మన మోహమనేది నిర్మోహమై పోతుంది. దివ్యత్వము ప్రాప్తిస్తుంది. ఈ అనుగ్రహంలో లీనమై పోతారు. కాబట్టి మానవుడు వచ్చినట్టి అనుగ్రహంలో లీనం కావడానికి వచ్చాడే కాని, లోక సంబంధమైనట్టి విషయాలనంతా అనుభవించడానికి కాదు. కనుక ఎవరెవరి కర్మ ధర్మాన్ని వారు ఆచరిస్తూ రావాలి. 'ధర్మోరక్షతి రక్షితః, ధర్మమేవ హతోహన్తి' కనుక ధర్మాన్ని మనము రక్షించాలి. ఎట్టి ధర్మాలు? మానవధర్మాలు రక్షించాలి. నీవు మానవుడవు కాదు, మాధవుడవే. కనుక నీ మానవత్వాన్ని నీవు పెంచుకో. దైవత్వమనేటి దానిని అభివృద్ధి కావించుకో.

ప్రేమస్వరూపులారా! ఈ రామతత్వము అనేటి దానిని ఎన్ని విధాల వర్ణించినప్పటికిని సాధ్యంకాదు. ఎన్నో తరతరాల నుంచి ఈ రామనామము వస్తునే వుంది. కావున ఎన్నో లక్షల సంవత్సరములనుంచి యీ మానవత్వం వస్తుంది. ఎన్నో లక్షల సంవత్సరముల క్రిందటనే యీ మానవత్వం ఉద్భవించినా యీనాటికి కూడా మానవత్వం ఏమిటో తెలుసుకొనలేకున్నారు. మానవాకారం ధరించడమే కాని, మానవత్వం గుర్తించడానికి ప్రయత్నించడం లేదు. ఈ మానవత్వాన్ని గుర్తించనప్పుడు మానవునిగా పుట్టి ప్రయోజనం ఏమిటి? కనుక మానవత్వమనేటిది ఏమిటి? అదియే ప్రేమతత్త్వము. ఈ ప్రేమను పదిమందికి మనం పంచాలి. నిరంతరము ప్రేమతోనే మనం జీవించాలి.

srisatyasaivachanamrutam

ప్రేమతోనే మనము దేహాన్ని వదలిపెట్టాలి. కంటినీటితో కాదు. ఆనందభాష్పాలతో వదలాలి. అదియే ప్రధానమైనటువంటి ఆశయము. కనుక యీనాడు పవిత్రమైనట్టి దినము. ఈ దినమును శ్రీరాముని స్మరించుకుంటూ, మన జన్మను సార్థకము చేసుకోవాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 05-04-1998న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam